

# నడమంత్రం


-వి.సి.ఆర్. కస్తూరి

అది హైదరాబాద్ శివార్లకు చాలా దూరాన వున్న చిన్న వూరు. ఆ వూరి మధ్యలో వున్న అతి పెద్దకాంపౌండు. అందులో కల్లు, సారా విక్రయించ బడుతుంది. అది చుట్టుప్రక్కల ఇరవైకిపైగా వున్న గ్రామాలకి కూడలి కేంద్రం కావటంతో పీడిత శ్రామికవర్గాలు సేదతీర్చుకునే ముఖ్యమైన స్థలమై పోయింది.

ఒకమూల సిమెంటు అరుగుమీద నర్సింగ్‌పల్లె నుండి వచ్చిన రాళ్ళకూలీలు సమావేశమయ్యారు. అందులో ప్రముఖుడు కొమరయ్య. మిగిలిన అందరు కూలీలకు అతనిమాటే వేదం.

దొంతరగా పట్టుకున్న సారా ప్యాకెట్లను పళ్ళతో చీల్చిఖాళీ సీసాలో పోసుకుని అది కొద్దికొద్దిగా ఓ సగం విగిరిన పాతకప్పులో పోసుకుని ఒక్కొక్కరు సిప్ చేస్తున్నారు. రాళ్ళక్రషర్‌ల దగ్గర రాళ్ళతో జీవిస్తూ రోజంతా రాళ్ళు కొట్టి వళ్ళూ, మనసూ రాయి చేసేసుకున్న రాతిజీవాలు.

"కొమరయ్య అన్నా! మన పేణం మంచిగున్నా లేకపోయినా రాత్రీపగలూ రాళ్ళుకొట్టికొట్టి మనం గిట్టానే మిగిలిపోతుండాము. కూలీయా పెరిగేది లేదు."



"అవునన్నా! మాతాత అంటుండె. మన బతుకులు గొంగళ్ళనంటివిరా అని. మవ్వే ఏదో వుపాయం కోషిష్ చేయాలి" అని మరొక కూలీదువ్వగానే కొమరయ్యకు కొండంత బల మొచ్చింది. ఒక పెద్ద రాజకీయ నాయకుడిలా దీర్ఘరాగం తీసి గణేశ్‌బీడి చేతబట్టి గట్టిదమ్ములాగా డు.

ఏదో ఆలోచన మెరుపులా మెరిసింది.

"ఆ! మన్మందరం ఒకేతాడు మీద నిల్చి ఒకేమాటమీదుంటే గేది సాధించలేంరా. రే: క్వారీకాడ కూలీలంతా పనిచెయ్యమని హఠ చెయాల. దానితో క్రషర్ ఆగిపోతది. సుత్తుల లొ నిల్చిపోతది. శేఠ్‌కు గిట్ట పెమటల్ పట్టి అడగటా: కొస్తడు. మీరంతా మాటంటే నేను రోజు కూ: పెంచాలనీ, బత్కమ్మ పండగకీ నెలజీతం ఈనా: ఇవ్వాలనీ, లేకపోతే పనిలోకి గిట్టదిగమని బజాయిం: సెప్త" అంటూంటే మిగిలిన కూలీలు ఆవేశపరు: య్యారు. సారాకప్పులు హామీ సూచనగా ఢీకొ న్నాయి. అక్వారీలో పనిచేసే రెండువందల పైచిలుకు ఆడామగా కూలీలకు వాళ్ళు ప్రతినిధులు.

"కొమరయ్య అన్నా! మువ్విప్పుడు సెప్పింది సాధించు. నిన్ను మేస్త్రీగా సేస్తాం. తలకో ఆఠణా వసూలుసేసి నీకిస్తం. మవ్వేటి సెబితే గదే"

మాంసం గోశీలు కొరుకుతూ ఓ వయసుపైబడ్డ శాల్తీ.

ఆ ఆనందంతో సారావోరు తుడుచుకుంటున్న కొమరయ్య నోటిలో ప్రేమతో ఓ వేయించిన మాంసం ముక్క పెట్టాడు ఓ కూలీ. ఆ పారవశ్యంలో ప్యాకెట్ల ప్యాకెట్ల సారా వాళ్ళకడుపుల్లోకి దూసుకుపోతోంది.

క్రొత్త కంకర సప్లయి చేస్తేనే పాతకంకరలాటు బాకీ పైసలు ఇస్తామని ఇంజనీరు షరతుపెట్టడంతో మొండికెత్తి పనిచెయ్యమని సమ్మెచేస్తున్న కూలీల కోర్కెలకు తలవొగ్గక తప్పలేదు క్వారీ శేఠ్‌కు. కొమరయ్య పథకంపారి కూలీలందరికి రోజుకూలీ గతంకంటే ఐదురూపాయలు పెరగటంతో క్వారీ కూలీలందరికీ తిరుగులేని నాయకుడైపోయాడు కొమరయ్య.

కొమరయ్య ఇప్పుడురాళ్ళు కొట్టడం లేదు. ప్రొద్దున్నే క్వారీలో అడుగుపెట్టి కూలీలందర్నీ బ్యాచ్‌లుగా విభజించి పనులు పురమాయించి కల్లు కాంపౌండ్‌లో కూర్చోవటం, ప్రొద్దువాలాకా కూలీల బట్వాడా తనచేతి మీదుగా జరిపి తన వాటా తీసికొని మళ్ళీ కొద్దిపాటి సారాతో నోరు తడుపుకొని తన గుడిసెచేరి మైకంగా ఒళ్ళుమరిచి నిద్రపోవటం కొమరయ్య రోజూ చేసే పని.

కొమరయ్య పెళ్ళాం పాతకాలం మనిషి. మొగుడెన్ని వేషాలేసినా నోరు మెదపకూడదనే మనిషి. అప్పుడప్పుడు కొమరయ్య ఇచ్చే డబ్బుతో సంసారం రోజూ మాంసం కూరతో గడుపుతూ, ఏడాది తిరగగానే నాలుగు మేకలను కొనింది. కొమరయ్య తల్లి వాళ్ళకు పెద్దదిక్కు. ఆమె రోజూ ఇంటికొచ్చేటప్పుడు ఓ సీసా కల్లు పట్టుకొస్తాడు కొమరయ్య. తనకొడుకు అభిమానానికి కొమరయ్య తల్లి గవరమ్మ చేటంత మొఖం చేసుకుంటుంది.

అలారోజులు దొర్లి పోతున్నాయి శరవేగంగా.

గవరమ్మ వాళ్ళగుడిసెకెదరుగావున్న పెంచల రెడ్డి ఇంట్లో పనిచేస్తుంది. పెంచలరెడ్డి తమ్ముడు దుబాయ్‌లో డాక్టరుగా పనిచేస్తున్నాడట. ఆ రెడ్డిబాబు కొమరయ్యను కలవమన్నాడని చెప్పగానే కొమరయ్య ఆయనను కలిశాడు. పెంచలరెడ్డి ఏవో చాలా పెద్ద వ్యాపారాలు చేస్తుండటం వలన క్షణం తీరికవుండదు. తన తమ్ముడికి హైద్రాబాద్‌లో ఖాళీస్థలముంది. అందులో మేడ కట్టించాలనీ దానికి తగిన మనుష్యుల్నీ, సరకు ఇస్తానని, ఆ ఇల్లు కట్టి పూర్తి చేసే బాధ్యత కొమరయ్యకు అప్పజెప్పాడు.

కొమరయ్య బాగా ఆలోచించాడు.

తను ఎలాగూ ఈ క్వారీ పనిలో ఖాళీగానే వున్నాడు.

క్వారీ లీడరు గిరీ పోకుండా తన మనిషైన మల్లేశును ఏజంటుగా నియమించి, వారానికొకసారి వచ్చి తన వాటా డబ్బు తీసుకుంటున్నాడు. పెంచలరెడ్డి జీపు మీద తిరుగుతూ ఇనుము, సిమ్మెంటు కొనటం, పనివాళ్ళ చేత పనులు చురుకుగానే చేయించి అయిదు నెలల కాలంలో అతడి అంచనాల మేరకు తృప్తిగా ఆ భవంతి పూర్తి చేశాడు కొమరయ్య.

పెంచలరెడ్డి అమితానందంతో మౌలాలీలోవున్న రెండు వందల గజాల ఖాళీస్థలం ఈనాంగా ఇచ్చాడు.

కొమరయ్య తెలివిగా కొంత ఇనుము, సిమెంటు ఆ పనిలో మిగిల్చి వెనకేశాడు.

ఆ పనిమీద హైద్రాబాద్ వెళ్ళడం రావటంతో కొమరయ్యకు హైద్రాబాద్‌లో స్థిరపడాలనే కోరిక పెరిగింది. రెడ్డి యిచ్చిన స్థలంలో ఇల్లుకట్టాలను కున్నాడు. ఏ దేముడికీ ఎప్పుడూ తలవొంచి మ్రొక్కని కొమరయ్యకు ఇల్లు కట్టేముందు చేసే శంఖుస్థాపన వగైరాలవంటివి బొత్తిగా తెలియదు.

తల్లి గవరమ్మే ఓ శుక్రవారం తెల్లవారు ఝామున పునాదులు తియ్యమంది. కొమరయ్య ఇద్దరు కూలీలను తీసుకొని గడ్డపారలతో స్థలం దగ్గరకు చేరారు. గీతలు గీసికొని భూమి తల్లిని త్రవ్వటం ప్రారంభించారు.

అన్ని ప్రక్కల లోతుగానే త్రవ్వారు.

ఈశాన్యం మూల త్రవ్వుతున్నారు. రాళ్ళగడ్డలు అడ్డు వస్తున్నాయి.

పెళ్ళగించి ఇంకా లోతు తవ్వుతున్నారు.

తన భార్య కూడబెట్టిన డబ్బుతో ముందుగా తలదాచుకోవటానికి ఓ రెండు గదులు దింపాలని కొమరయ్య పథకం!

గడ్డపారకు మళ్ళీ ఏదో అడ్డు తగుల్తోంది.

ఖంగు ఖంగు మని శబ్దం!

మళ్ళీ త్రవ్వారు! ఇంకా త్రవ్వారు!

యాదగిరి ఏదో అంచులాంటిది తగుల్తుందన్నాడు.

కొమరయ్య చేతిలో మట్టి పెళ్ళగించాడు.

అవి బిందెలు! లంకె బిందెలు!

కొమరయ్యకు చెమట్లు పట్టాయి. గోళ్ళతోనే చుట్టూ మట్టి త్రోసి, మెల్లిగా గడ్డపారతో వాటికి దారిచేసి బయటికి తీశాడు. నాలుగ ఇత్తడి బందెలతో బంగారం ముద్దలు! గుండెవేగం హెచ్చయిపోతోంది.

[illegible]

గొంతు తడి ఆరిపోతుంది.

క్షణం నేలమీద చతికిలపడిపోయాడు.

ఆలోచించి వాటి చుట్టూ పాతగుడ్డలతో మూటలక్రింద కట్టించాడు. ఆ ఇద్దరి కూలీల చేతిలో కొంత డబ్బుకుక్కి వాళ్ళ నోరు మూశాడు.

మెల్లిగా ప్రొద్దుపోయాక ఆ బిందెలు తమ అద్దెకుండే ఇంటికి చేర్చి వడివడిగా వాటిని అక్కడక్కడా గుట్టుగా కరిగించి వాటి రూపాలు మార్చాడు.

కూతురికీ భార్యకూ కాసులపేరు, వడ్డాణం వగైరా భారీగా చేయించాడు. కొంత రూపాయలుగా మార్చాడు. ఆర్భాటం చేయకుండా చడీ చప్పుడు లేకుండా రెండేళ్ళలో ఆ ఖాళీ స్థలంలో రెండంతస్తుల భవింతి కట్టాడు. చిన్నగా ప్రారంభించిన వ్యాపారాలని విస్తరించాడు.

కొమరయ్య శేఠ్ అయ్యాడు.

కొడుకు చంద్రం కాలేజీలో చదువుతున్నాడు.

కూతురు ఎనిమిదో స్టాండర్డుతో చదువు ఆపి ఇంట్లోనే వుంటూ తల్లికి సాయపడుతోంది. ఒక బార్ అండ్ రెస్టారెంట్, భువనగిరిలో ఓ పెద్ద సారాదుకాణం, ఆపై బంజరు భూములు కొని ప్లాట్లుచేసి అమ్మకం!

కొమరయ్య పట్టింది బంగారమౌతోంది.

రకరకాల వ్యాపారాల శాఖోపశాఖలౌతున్నాయి.

చంద్రం కాలేజీకి సరిగ్గా వెళ్ళకపోవటంతో బాగా చదువుకోవాలని ముసల్ది గవరమ్మ ఒత్తిడి చేసింది. కానీ చంద్రానికి చదువుమీద అసలు ఆసక్తిలేదు.

దానికి కారణం కొమరయ్య వ్యాపారాలూ, ఐశ్వర్యమూను—

ఒకసారి కొమరయ్య చంద్రాన్ని పిలిచి ఉద్బోధ చేశాడు.

'ఒరే మా తాత సద్వలేదు. మావాన్న సద్వలేదు. మా తాత ఎగసాయం చేసి పుట్లు పుట్లు [illegible]ల్తి పండించుండు. మన గిప్పుడు లోటేం[illegible] ఇగనువ్వుగా వేషాలు కట్టిపెట్టి మన దండల్ల సులువులు నేర్చుకో'— అని తన కూడా త్రిప్పుకుంటూ తన వారసుడిగా తయారు చేయటానికెంతో తాపత్రయపడ్డాడు కొమరయ్య.

కాని చంద్రం మనస్సవేరు. తానెందుకు కష్టపడాలనీ. డబ్బు విచ్చలవిడిగా ఖర్చుపెట్టడం, కార్లలో స్నేహితులతో విలాసంగా తిరుగుతూ వందిమాగధులవంటి స్నేహబృందాన్ని కూడా త్రిప్పుకోవటమే అతని నిత్యకృత్యమైంది.

కూతురు పెళ్ళి కెదగటంతో భార్య, తల్లి గవరమ్మ పోరు మొదలెట్టారు. కొమరయ్యకు తన కూతురు బాగా వలుపు ఛాయ కలిగి కొద్ది పోలియోతో కుంటిగా నడుస్తున్నా డబ్బుతో మంచి అల్లుడ్ని కొనగలనే ధీమా వుంది.

ఈ విషయం— తెలిసిన అందరి చెవిన వేశాడు.

పోచంపల్లి నుండి ఓ సంబంధం వస్తే ఖాయం చేశాడు కొమరయ్య. పెళ్ళి కొడుక్కి ఒక స్కూటరు, వ్యాపారం పెట్టుకోవటానికి లక్ష రూపాయల కట్నంతో వైభవంగా పెళ్ళిచేసి కూతుర్ని తన తాహతుకు తగ్గట్టు ఏభై తులాల బంగారం, చీరసారెతో అత్తవారింటికి సాగనంపాడు.

వాలుగు చేతులా సంపాదిస్తున్నా ప్రజలు తనని 'కంకర కొమరయ్య' అనే వాడుకలో పిలవటంతో అప్పుడప్పుడు గతం గుర్తుకొచ్చి గుండె గతుక్కుమనేది. అదృష్టం తన్నుకు వస్తే ఎవ్వర్నూ ఆపలేరు అని సమాధాన పర్చుకున్నాడు తన మనస్సుని.

'జామాతా ఏకాదశావతారః' అన్నట్లు అల్లుడి గొంతెమ్మ కోరికలు రోజు రోజుకీ పెరిగిపోతున్నా కొమరయ్య లెక్కచేయలేదు. అడిగిందల్లా చెల్లిస్తూ వచ్చాడు— ఒక్కర్తే కూతురనీ అందులో అవిటిదనే సానుభూతితో—

మొదటి పండుగకి అల్లుడ్నీ కూతుర్నీ పిలిచి ఘనంగానే కానుకలతో సత్కరించాడు కొమరయ్య.

కొమరయ్యకు ఒక్కటే బెంగ!

కొడుకు చేతికి అందివచ్చినా ఇంకా బాధ్యత ఎరిగి వ్యాపార మెలుకవలు తెల్సుకోవటంలేదనే. ఒక్కగానొక్క వారసుడు. జులాయిలా తిరుగుతూ డబ్బు విచ్చలవిడిగా ఖర్చుపెట్టడమొక్కటే వాడికి తెల్సిన విద్య.

రెండు రోజుల్నించి కంట్లో వలుసే అయితే కొడుకు చంద్రం ఏమయ్యాడని భార్యనడిగాడు కొమరయ్య. ఫ్రెండ్సుతో గండిపేట పిక్నిక్‌కి వెళ్ళాడని చెప్పింది. తను సంపాదించిన ఆస్తిపాస్తుల అండదండలే కొడుకు చంద్రాన్ని ఇలా తయారు చేస్తోందని మనస్సులో బాధపడ్డాడు.

ఆ రోజు తెల్లవారింది.

ఇంటి ముందు కాంపౌండులో మొక్కలకు నీళ్ళు పోయిస్తున్నాడు కొమరయ్య.

తెల్ల తెల్ల అంబాసిడర్ కారు హారన్ మ్రోతతో ఇంటిముందు ఆగింది.

చంద్రం స్నేహితులు ఇద్దరు డోరు తెరుచుకుని దిగారు.

కారు డిక్కీ తెరిచి కొడుకు చంద్రాన్ని మోసుకొస్తున్నారు.

కొమరయ్య హతాశుడై గట్టి కేకవేశాడు. ఇంట్లోంచి అందరూ వచ్చారు. పొరుగింటివా ళ్ళంతా ప్రోగయ్యారు.

స్నేహితులంతా గండిపేట చెరువులో ఈదుతుంటే చంద్రం ఈత రాకపోవటంతో సుడిగుండంలో చిక్కుకొని మునిగిపోయాడట.

వెదికి వెదికి చంద్రం శవాన్ని బయటికి తీసి తెచ్చారట.

చెట్టంత కొడుకు రాలిపోయాడు.

ఎప్పుడూ కంట తడిపెట్టని కొమరయ్య వలవలా ఏడ్చాడు. తన చేతితోనే కొడుకు అంత్యక్రియలు జరిపాడు. బంధువులంతా చేరారు.

తల్లి గవరమ్మ ఇదంతా వడుమంత్రపు నిధుల శాపమంది.

కొమరయ్య అన్నం కూడా తినకుండా ఏకాకిగా దిగాలుతో కూర్చుంటే తల్లి గవరమ్మ వసుక్కుంటూ— 'ఒరే కొమిరీ! గా గుడిశెల్లవుంటూ రాళ్ళు కొట్టుకుంటున్నప్పుడే మన పేణాలు ఎంతో సుకాల వుంటూ— రెండు పూటలూ బువ్వ తిన్నం. ఈ వడమంత్రం సిరి సెంద్రిగాడ్ని బలిసేసిందిరా. ఇంకెంతమందిని తోలుకుపోతదో... '' అంటూ రాత్రీ పగలూ ఒకటే రొద పెట్టింది.

బంధువులంతా కూడా వంతు పాడారు.

కొమరయ్య పిచ్చివాడై పోయాడు.

లోకులు కాకులై— ఈశాపం తమ కుటుంబాన్నే చుట్టేస్తుందని, ముందుగా కొడుకు చంద్రాన్ని బలితీసుకొందని, కాటేసిందని కోడైకూసారు.

కొమరయ్య కృంగిపోయాడు. వంగిపోయాడు.

నాగప్రతిష్ఠ చెయ్యాలన్నారు. గుళ్ళు కట్టించాలన్నారు. ఎవరు చెప్పినదన్నా చేశాడు. ఏకైక వారసుడు పోగానే జీవితాసక్తినే పోగొట్టుకున్నాడు. వైరాగ్య ధోరణిలో దైవభక్తి విపరీతంగా చోటు చేసుకుంది

ప్రసవానికి కూతురు పుట్టింటికొస్తే అల్లుడికి కబురుపంపి తన ఆస్తి అంతా అతని కప్పజెప్పి ఏకైక వారసుడ్ని చేశాడు. ఆ మిడిసిపాటుతో అల్లుడు విచ్చలవిడిగా డబ్బు దుబారా చేస్తూ తగలేస్తున్నా కొమరయ్య కిమ్మనలేదు.

పరిస్థితులు తారుమారై అంధకారంలాంటి విషాదంలో చిక్కుకున్నప్పుడు మనిషి మూఢ నమ్మకాలకు తలొగ్గి కనిపించని ఓ అతీతశక్తికి ఆసరా కోసం బానిసైపోతాడు. ●

## ఏది గొప్ప?

ఓ శాకాహారి, మాంసాహారి రైల్లో ప్రయాణం చేస్తున్నారు. శాకాహారం గొప్పదని, మాంసాహారం గొప్పదని కాసేపు వాదించుకుని విసుగెత్తి వూరుకున్నారు. శాకాహారి టీకోసమో సూట్‌కేస్ తెరవబోయాడు. ఎంత ప్రయత్నించినా రాలేదు. మాంసాహారి వెంటనే దాన్ని అంది పుచ్చుకుని నిమిషంలో తెరిచాడు.

'చూశావా! మాంసాహారం తింటే బలం, శక్తి పెరుగుతాయి. అర్థమయ్యిందా?' అన్నాడు గర్వంగా.

శాకాహారి ఏమీ మాట్లాడలేదు. కాసేపాగి శాకాహారి లేచి రైలుపెట్టెలో గొలుసుని లాగబోయి రెండు మూడుసార్లు ప్రయత్నించి తల అడ్డంగా వూపి 'రావడం లేదు' అన్నాడు.

మాంసాహారి లేచి గొలుసుపుచ్చుకుని ఒక్క గుంజు గుంజాడు. గొలుసు వూడి చేతిలోకొచ్చింది. రైలువెంటనే ఆగింది.

ఓ ఇద్దరు కానిస్టేబుల్స్‌తో ఆ రైలుపెట్టెలోకి వచ్చిన గార్డు మాంసాహారికి గొలుసు లాగి రైలాపినందుకు రెండువందల రూపాయలు జరిమానా వేశాడు. రైలు కదిలింది.

'చూశావా! శాకాహారం తింటే బుద్ధిబలం తెలివితేటలూ పెరుగుతాయి. మీరు ఇటు పై ఆలోచించండి' అన్నాడు శాకాహారి మాంసాహారితో.